క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష శిబిరం పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం తేనెబండలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని డీఐఓ రవిరాజు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆరోగ్య సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

ఐరాల: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీడీఓ కుసుమకుమారి మాట్లాడుతూ సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ


కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరులో చేస్తున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ అరుణ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 31, 32 వార్డు సచివాలయాల పరిధిలో గురుబేకరీ వీధి, వినాయక గుడి వీధి, ఆర్కాడు వీధి, గంగా క్రాస్, కావేరీ క్రాస్, ఏ, బీ క్రాస్ వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల తీరును, పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదు, హాజరు రిజిస్టర్ల తనిఖీ చేశారు. కార్మికులతో మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో తడి, పొడి వ్యర్థాల సేకరణ మెరుగ్గా చేయాలన్నారు. వార్డు స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుద్ధ్య పనులు పక్కాగా పర్యవేక్షించాలని వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు ఉద్యోగోన్నతి

పూతలపట్టు: పూతలపట్టు మండలం పి.కొత్తకోటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు ఉద్యోగన్నతి పొంది బదిలీ అయ్యారు. జనరల్ సర్జన్ పావణిచంద్రా రాయా మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, వైద్యధికారి శిరీష జనరల్ మెడిసన్ అసిస్టెంట్ ఫొఫెసర్‌గా ఉద్యోగన్నతితో బుధవారం బదిలీ అయ్యారు. సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ డెప్యూటి సివిల్ సర్జన్‌గా పెనుమూరు సామాజిక ఆరోగ్యకేంద్రానికి బదిలీ కానున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో నాణ్యమైన వైద్యం


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద సామాన్యుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు అన్నారు. బుధవారం మండలంలోని మత్యం సచివాలయ పరిధిలోని ముట్టుకూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి 57 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధితో మంచానికే పరిమితమైన వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సూచనలిచ్చారు.104 మొబైల్ క్లినిక్ వాహనంలో గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి సలహాలిచ్చారు. ఎంఎల్‌హెచ్‌పీ రూప్సీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిఘా కట్టుదిట్టం: డీఎస్పీ


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న డీఎస్పీ

పలమనేరు: ఎన్నికల నేపథ్యంలో నిఘా కట్టుదిట్టం చేసి సరిహద్దుల నుంచి మద్యం, డబ్బు మొదలైన వాటి అక్రమ రవాణాకు చెక్ పెట్టాలని పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన సబ్ డివిజన్ పరిధి లోని సీఐలు, ఎస్‌ఐలు, ఎస్‌హెచ్‌ఓలతో సమీక్షించారు. పలమనేరు ప్రాంతం అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో కీలకంగా వ్యవహరించాలన్నారు.పాత కేసుల్లో నిందితుల బైండోవర్, ట్రబుల్ షూటర్స్‌పై గట్టి చర్య లు తీసుకోవాన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణ ఇత్యాది వాటిపై చర్చించారు.

సైన్సుమేళా.. ప్రయోగాలు భళా


ఐరాల: నమూనాలను వివరిస్తున్న విద్యార్థులు


తవణంపల్లె: దిగువ తడకరలో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ హేమలత


బంగారుపాళెం: విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు

గుడిపాల: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సైన్సు మేళా దోహదం చేస్తుందని మండల విద్యాశాఖాధికారి రామ్‌నాయక్ అన్నారు. సీవీ రామన్ జయంతి పురస్కరించుకుని జాతీయ సైన్స్‌డే నిర్వహించారు. మండలంలోని నరహరిపేట, చిత్తపార హైస్కూల్లో సైన్స్ మేళాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. పోటీ ప్రపంచంలో విజ్ఞానాన్ని పెంపొందించాలంటే విద్యార్థి దశ నుంచే వారికి సైన్స్‌పై మక్కువ పెంచాలన్నారు. మండలంలోని శ్రీరంగంపల్లె, కమ్మతిమ్మాపల్లె, బొమ్మసముద్రం సీఆర్సీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలపై తయారు చేసిన సైన్స్ నమూనాలను మేళాలో ప్రదర్శించారు. ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని నగరంలోని పలు పాఠశాలల నిర్వాహకులు అన్నారు. బుధవారం నగరంలోని బృందావన్, లిటిల్‌రోస్, నారాయణ, విజయం పాఠశాలల్లో జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలు, చేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బృందావన్ పాఠశాల కరస్పాండెంట్ శైలజాకుమారి, నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ వేదవతి, లిటిల్ రోస్ పాఠశాల డైరెక్టర్ లోహిత్ కుమార్, విజయం పాఠశా ల డైరెక్టర్ శైలజ, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

తవణంపల్లె: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి తమ మేధాశక్తిని చాటాలని ఎంఈఓ హేమలత తెలిపారు. బుధవారం మండలంలోని ఆరు సీఆర్‌సీ సెంటర్లలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దిగువ తడకర, పట్నం సీఆర్‌సీల్లో జరిగిన సైన్స్ మేళాలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రయోగాలను ఆమె పరిశీలించారు. సీవీ రామన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. వకృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అరగొండ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బృందావన్ పాఠశాలలో..


విజయం పాఠశాలలో..

సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఐరాల: విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు ఆకాంక్షించారు. మండలంలోని సీఆర్సీ క్లస్టర్ పరిధిలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. 35 యర్రంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో నమూనాలను ఎంఈఓలు పరిశీలించారు. సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు లత పాల్గొన్నారు.

కె.గొల్లపల్లెలో..

యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పరిశీలించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

బంగారుపాళెం: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు సైన్స్ మేళా గొప్ప వేదికని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రన్ అన్నారు. సీవి రామన్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. బంగారుపాళెం, తుంబకుప్పం, మొగిలి మిట్టూరు, ఎగువరాగిమానుపెంట, మంగళపల్లె, పీడీవీ కండ్రిగ, గుండ్లకట్టమంచి, బోడబండ్ల, టేకుమంద, తుంబపాళెం సీఆర్‌సీల్లో ఆయా హెచ్‌ఎంల ఆధ్వర్యంలో సైన్స్‌మేళా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలు ఆకట్టు కున్నాయి. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.


గుడిపాల: సైన్సుమేళాను పరిశీలిస్తున్న అధికారులు


నారాయణ పాఠశాలలో..


లిటిల్‌రోస్ పాఠశాలలో..

మొండి బకాయిలు వసూలు చేయండి

- ట్రాన్స్‌కో సీజీఎం ధర్మజ్ఞాని


మాట్లాడుతున్న సీజీఎం ధర్మజ్ఞాని

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో ఉన్న మొండి బకాయిలను వసూలు చేయాలని ట్రాన్స్‌కో రెవెన్యూ సీజీఎం ధర్మజ్ఞాని ఆదేశించారు. బుధవారం అర్బన్ ఈఈ కార్యాలయంలో ఎస్‌ఎఓ శ్రీనివాసులతో కలిసి అధికారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రెండు డివిజన్ల పరంగా ప్రతినెలా కలెక్షన్ రూ.42.39 కోట్లు ఉందన్నారు. మొండి బకాయిలు రూ.2 కోట్లు ఉందన్నారు. ఇవి కాకుండా ప్రభుత్వ మొండి బకాయిలు సంవత్సర పరంగా రూ.71 కోట్లు ఉందన్నారు. పంచాయతీ బకాయిలు చెల్లించాలని డీపీఓ లక్ష్మికి తెలియజేశామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్లు వాడుకునే వెసులుబాటు ఉందన్నారు. దానిపై వాడితే బిల్లులు కట్టాలన్నారు. పలువురు అలా కట్టకపోవడంతో బకాయిలు పెరుగుతున్నాయన్నారు. వర్క్‌ఆర్డర్లను ఏఈలు మార్చి లోపు క్లోజ్ చేయకపోతే వారి జీతాల నుంచి కట్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఈఈలు హరి, పద్మనాభపిళ్లె, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు, ఏఈఈలు రాజేంద్రబాబు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఐరాలలో 2,574 పోలియో కేంద్రాలు


బంగారుపాళెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఐరాల: ఐరాల మండలంలో మార్చి 3వ తేదీన 2,574 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత తెలిపారు. పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియోపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు.

బంగారుపాళెంలో 48 కేంద్రాలు

బంగారుపాళెం: మండలంలో మార్చి 3వ తేదీన జరుగనున్న పల్‌పోలియో కార్యక్రమానికి 48 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. ఎంపిడిఓ సమావేశ భవనంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలకు పల్స్‌పోలియోపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శివశంకర్ మాట్లాడుతూ, పోలియోరహిత సమాజం కోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు.

అడవికి నిప్పు పెడుతున్న ఆకతాయిలు



పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల పక్కన అడవులకు కొందరు ఆకతాయిలు నిప్పు పెడుతుండడంతో ఎక్కడో ఒకచోట అడవి కాలిబూడిదవుతోంది. నిత్యం అగ్నిమాపక యంత్రానికి పని తప్పడం లేదు. బుధవారం సైతం గంగవరం మండలంలోని పత్తికొండ ప్రాంతంలో నిప్పు అంటుకుని కొంతమేర అడవి కాలిపోయింది. మొన్న మొగిలి, నిన్న సాకేవూరు అడవులకు నిప్పంటుకుంది. దీనిపై నిఘా ఉంచామని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని స్థానిక ఎఫ్‌ఆర్వో శివన్న హెచ్చరించారు.

జగనన్న పాలనలో మైనారిటీల అభ్యున్నతి


మసీదు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

- మసీదు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమంతోపాటు మైనారిటీల అభ్యున్నతికి కూడా ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. మండలంలోని విజలాపురం పంచాయతీ సంతమిట్టలో బుధవారం ఆయన నూతన మసీదును ప్రారంభించి మాట్లాడారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ముస్లింలకు జగనన్న తగిన ప్రాధాన్యత ఇచ్చి పదవులు కట్టబెట్టారన్నారు. అనంతరం మసీదు పెద్దలు భరత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామ గౌడు, మండల కో–ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, మాజీ సర్పంచ్ మురళి, మసీదు పెద్దలు హైదర్‌బాషా, షమీవుల్లా, రషీద్, నసీముల్లా, అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ సేవకులు


వలంటీర్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు

తవణంపల్లె: వలంటీర్లు సంక్షేమ సేవకులని వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గురుకువారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.ప్రకాష్‌రెడ్డి, గురునాథరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, అపోలో హాస్పిటల్స్ ప్రెసిడెంట్ నరోత్తమరెడ్డి ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత వలంటీర్లను సత్కరించారు. ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు సల్లాపురమ్మ కుంభాభిషేకం

ఐరాల: మండలంలోని నెల్లిమందపల్లె శ్రీసల్లాపురమ్మ ఆలయంలో గురువారం కుంభాభిషేకం, మహా శివుని శూల ప్రతిష్ఠ, పంచలోహాలతో నూతనంగా తయారుచేసిన అమ్మవారి విగ్రహ ఊరేగింపు మహోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు

చిత్తూరు రూరల్: పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లా అధికారులు చురుగ్గా ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 3న చుక్కల మందు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 2,09,971 మందికి పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించారు. పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు, వైద్య అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే చిన్నారులందరికీ 3 దశల్లో పోలియో చుక్కలు వేయనున్నారు. అందుకోసం జిల్లాలో 1,415 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లు 112 మంది, కోర్ గ్రూప్ ఆఫీసర్లు 08, సూపర్‌వైజర్లు 1,530, ఆశా వర్కర్లు–1,989, ఏఎన్‌ఎంలు–612 మంది పాల్గొననున్నారు. 206 మొబైల్ బృందాలు హైరిస్క్‌ప్రాంతాల్లో పర్యటించనున్నాయి.

రాకెట్ సూపర్



పలమనేరు: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం విజ్ఞానమేళాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, పెంగరగుంట ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళాను ఎంఈఓ లీలారాణి సందర్శించారు. పెంగరగుంట విద్యార్థులు రూపొందించిన పీఎస్ఎల్‌వీ రాకెట్ నమూనా విశేషంగా ఆకట్టుకుంది. అందరూ ఉత్సాహంగా ఆ నమూనా ముదు సెల్ఫీలు తీసుకుని సంబర పడ్డారు. పీఎస్ఎల్వీ రాకెట్ సిరీస్‌లో ప్రయోగించిన ఉపగ్రహాల గురించి టీచర్లు విద్యార్థులకు తెలియజేశారు. ఇతర పాఠశాలల్లో పిల్లల ప్రయోగాలైన హృదయం, జీర్ణవ్యవస్థ, వాతావరణం, నీటి ఆవిరితో నడిచే జేసీబీ, ఆటోమేటిక్ ట్రాఫిక్ సిగ్నల్ సిస్టం, హోమ్ థియేటర్, గాలితో, నీటితో పనిచేసే వాక్యూమ్ క్లీనర్ల ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.